క్లుప్తంగా

ఘనంగా గంగ జాతర



గంగమ్మకు ప్రత్యేక పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఎస్.ఉప్పరపల్లెలో గురువారం గంగమ్మ జాతర గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా ప్రజలు తరలివచ్చి జాతర వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులందరూ జాతరలో పాల్గొనడంతో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీనియర్ నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, హరిక్రిష్ణారెడ్డి, క్రిష్ణారెడ్డి, రాజారెడ్డి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని రాయచోటి సాయిల్ కన్జర్వేషన్ ఏడీఏ మణి ఎరువుల దుకాణాల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా స్టాక్ రికార్డులు, లైసెన్సు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. దుకాణదారుల ధరల బోర్డులను రైతులకు కనపడేలా ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయశాఖ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే విక్రయించాలన్నారు. రైతులకు బిల్లులు తప్పక ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన మందులను విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం.మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



మండల అధికారులతో సమావేశమైన వైద్యుడు సానే శేఖర్

పుల్లంపేట : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సానే శేఖర్ ప్రజలకు సూచించారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అతిసార నియంత్రణ మాసోత్సవాలు జరుపుతాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రాలలో జింక్ కార్నర్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని, విరేచనాలు సోకిన వ్యక్తికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనారాయణ, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ చక్రధర్ రాజు, ఈఓపీఆర్డీ పెంచలయ్య, సీహెచ్ఓ రాజ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

లక్కిరెడ్డిపల్లె : ఏపీ మోడల్ స్కూల్స్ టీచర్లకు జీఓ నెంబరు. 23 ప్రకారం వెంటనే 010 పద్దు క్రియేట్ చేసి జీతాలు చెల్లించాలని టీడీపీ నేషనల్ పొలిటికల్ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌కు మంగళగిరి టీడీపీ సెంట్రల్ ఆఫీసులో గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్ కార్డ్స్ అమలుకు చర్యలు చేపట్టాలని, టీజీటీ హిందీ పోస్టులను పీజీటీ పోస్టులుగా ఉన్నతీకరించాలని కోరామన్నారు. ఈ సమస్యలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు నివేదించి పరిష్కరిస్తామని టీడీ జనార్దన్ హామీ ఇచ్చారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

కడప ఎడ్యుకేషన్ : విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని ఆర్‌జేయూపీ నాయకులు కోరారు. ఈ విషయమై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని పులివెందులలో ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల సవరణతోపాటు ఖాళీగా ఉన్న అన్ని రకాల క్యాడర్ల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముత్తోజి వీరబ్రహ్మం, వెంకటసుబ్బయ్య, వీరయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అపరిశుభ్రతతో విష జ్వరాలు ప్రబలే అవకాశం

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మురుగు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టాలి
- జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ



మాధవరం-1లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ

సిద్దవటం : గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉండటం వల్ల ప్రజలకు విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని మహబూబ్ నగర్‌లో గురువారం జరుగుతున్న పారిశుధ్య పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప - చెన్నై ప్రధాన రహదారిలోని మాధవరం-1 గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నీరు పోకుండా నీరు నిల్వ ఉండటం వల్ల విష జ్వరాలు సోకుతాయన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అందుకే మహేష్ అనే బాలుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిందన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలు ప్రతి ఒక్కరూ మీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పొడిచెత్త, తడిచెత్తను హరిత రాయబారుల వాహనంలో వెయ్యాలని, ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య, సూపర్‌వైజర్ రమణయ్య, ఆరోగ్య కార్యకర్త సుజాత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్య, ఆశ వర్కర్‌లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బెటాలియన్ పాఠశాల తనిఖీ

ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల తాగునీటి ట్యాంకును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియాల పట్ల విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. రాత్రి వేళలో ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలని, ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉండాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై విద్యార్థినీ, విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, జ్వరాలు వస్తాయని ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో ఫుల్ వస్త్రాలను ధరించాలన్నారు. దోమలు రాకుండా మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో వేప పొగను వేస్తే దోమలను నియంత్రణ చేయవచ్చునని తెలియజేశారు. భోజనం చేసే సమయంలో ప్రతి విద్యార్థి చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలలో బాత్రూంలను పరిశుభ్రంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

రవాణా శాఖ నిబంధనలు పాటించాలి



రాజంపేట ఆర్టీసీ బస్టాండు వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఆర్టీసీ డీఎం, ఎంవీఐ

రాజంపేట : ప్రతి ఒక్క వాహనదారుడు నిబంధనలు తప్పనసరిగా పాటించాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కడప - తిరుపతి రహదారిలో ఆర్టీసీ, రవాణా శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే నడపాలన్నారు. అలా కాకుండా నడిపితే తనిఖీలలో పట్టుబడితే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. రవాణాశాఖ పరంగా వాహనాలకు చెల్లించాల్సిన ట్యాక్స్, వివిధ రకాల అనుమతులు తప్పనసరిగా కలిగి ఉండాలన్నారు. అలాగే రోడ్డు సెఫ్టీ రూల్స్‌ను పాటించాలన్నారు. ఆర్టీసీ డీఎం రమణయ్య మాట్లాడుతూ నెలకొకసారి నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 45 వాహనాలను తనిఖీ చేసి, 8 వాహనాలకు వీసీఆర్ జారీ చేశామన్నారు. ఎనిమిది వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిపో కార్యాలయం అధికారి మోడపోతుల రమణయ్య, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సాంకేతిక విద్యపై శిక్షణ



పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుతున్న దృశ్యం

సంబేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆధునిక బోధనోపకరణాల వినియోగంపై శ్రీ వెంకటేశ్ పెరుమాల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు గురువారం శిక్షణ ఇచ్చారని ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి తెలిపారు. గ్రూప్ లీడర్ శ్రీవాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు టెక్నాలజీతోపాటు పర్యావరణంపై అవగాహన కల్పించారన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదివే ఈఈఈ విద్యార్థులు ఈ సామాజిక సేవా ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. సాంకేతిక విద్య, మొక్కలు నాటడంతోపాటు బ్లడ్ డొనేషన్ క్యాంపును వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి, ఉపాధ్యాయులు రెడ్డయ్య రెడ్డి, జయరామ నాయక్, రెడ్డిశేఖర్, నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయపరమైన సమస్యలు పరిష్కరించండి



మంత్రి మండిపల్లెకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

రాయచోటి టౌన్ : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఏపీ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహకుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది తమ అసోసియేషన్ సభ్యులతో కలసి మంత్రిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో తమ ఉద్యోగులు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

కలకడ : క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీసీజీ టీకాతో టీబీ వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి పరిధిలోని ముడియంవారిపల్లె పంచాయతీ గొళ్లపల్లె, కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం, కదిరాయచెర్వు పంచాయతీ వడ్డిపల్లె, దేవులపల్లె పంచాయతీ వడ్డిపల్లె గ్రామాలలో నిర్వహిస్తున్న బీసీజీ టీకా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ వెంకటేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు దోపిడీపై చర్యలు తీసుకోండి



రాయచోటి అర్బన్: డీఈఓ శివప్రకాశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌బీ నేతలు



పెనగలూరు: విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత రమణ

రాయచోటి అర్బన్ : జిల్లాలో విద్యార్థుల నుండి అధిక మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషా డిమాండ్ చేశారు. గురువారం ఆయన డీఈఓను ఏఐఎస్‌ఏ నేతలతో కలసి మాట్లాడారు. జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తమ పాఠశాలల పేర్లతో టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్, మెటీరియల్స్‌ను ముద్రించి మార్కెట్ ధరలకంటే మూడు రెట్లు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారంటూ ఆరోపించారు. టై, బెల్ట్, బూట్లు, యూనిఫాం దుస్తులను సైతం అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైమరీ తరగతులకే వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల రక్తాన్ని పీలుస్తున్నారన్నారు. విద్యా హక్కు చట్టం అమలును తుంగలో తొక్కుతున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామంటూ హెచ్చరించారు. అనంతరం ఈ మేరకు ఏఐఎస్‌బీ నేతలతో కలసి డీఈఓ శివప్రకాశ్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నేతలు క్రిష్ణారెడ్డి, షేక్‌షావలి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు తగ్గించాలి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దందా అరికట్టడంలో మండల విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలపై ఎంఈఓలు నిఘా పెట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, బూట్లు, యూనిఫాంలను అందజేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులతోపాటు యూనిఫాం మా వద్దనే కొనాలి, పుస్తకాలు మా వద్దనే కొనాలి, విద్యార్థులకు కావాల్సిన ప్రతి వస్తువు మా వద్దనే కొనాలని ప్రైవేటు పాఠశాలలు తల్లిదండ్రులపై భారం మోపుతుండటంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోలేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చందు, ప్రశాంత్, కుమార్, సాయి కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఆర్మీ జవాన్‌కు నివాళి



కిషోర్ కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామ నివాసి, మాజీ ఆర్మీ జవాన్ కిషోర్ కుమార్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి గురువారం కిషోర్ కుమార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడికోట వెంకటసుబ్బారెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, గీతాల నరసింహారెడ్డి, సిద్దవరం గోపిరెడ్డి, ఆరిగెల సౌమిత్రి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, ఆనాల మధు యాదవ్, మధురాజు, మోషే, గంగయ్య, నాగేశ్వరరెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కర్మకాండకు హాజరైన మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీలు



నివాళి అర్పిస్తున్న నాయకులు

లక్కిరెడ్డిపల్లె : సోమలవాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న వెంకటరమణ కోడలు దశదిన కర్మకాండ కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రాంరెడ్డి, హరినాథ్ రెడ్డి, సుదర్శన్ రాజు, సుబ్బయ్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు సిద్దక నాగిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబు, గంగమ్మ ఆలయ చైర్మన్ రెడ్డయ్య, మాజీ సర్పంచ్ దుర్గయ్య, పెద్ద వెంకటరమణ, వెంకటేష్, నాగేంద్ర, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కే యూనివర్సిటీతో ఎంఓయూ

కురబలకోట : ఎస్కే యూనివర్సిటీ అటల్ ఇంకుబేషన్ సెంటర్‌తో అంగళ్లులోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల ఎంఓయూ కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డి. రమణారెడ్డి గురువారం తెలిపారు. కేంద్రం రూపొందించిన అటల్ ఇంకుబేషన్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఇన్నోవేషన్ స్టార్ట్ అప్స్‌పై అవగాహన కల్పించారు. ఇది విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి తోడ్పడుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి కుట్ర



మాట్లాడుతున్న మిర్యాల సురేఖ

రాజంపేట టౌన్ : ప్రభుత్వ చర్యలు ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించేలా ఉన్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌ఛార్జ్ మిర్యాల సురేఖ దుయ్యబట్టారు. రాజంపేటలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలైనా ఇప్పటి వరకు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బెల్టు, బూట్లు, సాక్సులు ఇవ్వలేదని ఇదేనా బాబు పనితీరు అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు అన్నీ అందేవన్నారు. బాబు పాలనను గమనిస్తే గతంలో లాగానే ఆరు నెలల పరీక్షల వరకు విద్యార్థులకు పుస్తకాలు అందే పరిస్థితి కనిపించడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల అధిపతులే ప్రభుత్వంలో భాగస్వామ్యమై ఉన్నారని, అందువల్ల ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టేందుకు చూపే శ్రద్ధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై చూపి ఉంటే ఈపాటికి విద్యార్థులకు అన్ని సమకూరేవని ఆమె తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచాలి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఆర్ఎస్‌యూ నేతలు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను మరింతగా పెంచాలని ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీరెడ్డి కోరారు. గురువారం ఆయన తన సంఘం నేతలతో కలసి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఉడికి ఉడకని అన్నం, నీళ్ల రసంతో కూడిన భోజనాన్ని అందిస్తుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. సరైన మధ్యాహ్న భోజనం అందని కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు ఇళ్ల నుండి భోజనాన్ని క్యారియర్‌లో తెచ్చుకుంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి వంట ఏజెన్సీ నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలంటూ కోరారు. లేనిపక్షంలో త్వరలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నేతలు శివరాం, వెంకటరమణ, శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : కాకినాడలో జూలై 8, 9, 10 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు రాజకీయాలపైన ఆసక్తిని కనబరచాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. చదువుతోపాటు విద్యావ్యవస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పోరాటాలు చేయడం ఎలా అనే అంశంపై శిక్షణా తరగతులలో అవగాహన కల్పిస్తామన్నారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్సుగా నిలిచిన నీట్‌పరీక్షను కేంద్రప్రభుత్వం వెంటనే రద్దుచేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలంటూ కోరారు. విద్యార్థులను మరింత చైతన్యవంతులను చేసేందుకు కాకినాడలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు విద్యార్థి లోకం హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు.

ముగిసిన మహాభారత యజ్ఞం



కళాకారులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

రామాపురం : మండల కేంద్రంలో 18 రోజులపాటు జరిగిన మహాభారత యజ్ఞం కార్యక్రమం గురువారంతో ముగిసింది. 18 రోజులపాటు ఉదయం మహాభారతాన్ని హరికథ రూపంలో, రాత్రి సమయాల్లో పౌరాణిక నాటకాల రూపంలో ప్రజలకు వివరించారు. మహాభారత యజ్ఞం ఏర్పాటు చేయడం వల్ల ఆ మండల ప్రాంత వాసులు సుఖసంతోషాలతో ఉంటారని, పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని వర్షాలు బాగా కురుస్తాయన్న నమ్మకంతో ఈ మహాభారత యజ్ఞాన్ని ఏర్పాటు చేశారు. పురాణ గాథలు వినడం వల్ల మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా ఆయు రారోగ్యాలతో ఉంటారన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన అగ్నిగుండ ప్రవేశంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. మహాభారత యజ్ఞం కమిటీ చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు దామోదర్‌నాయుడు, భక్తవత్సలరెడ్డి, నాగభూషణ్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

గ్రూప్ 2 మెయిన్స్‌కు అదనపు సమయం ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను గుర్తించి మెయిన్స్ పరీక్షకు మరింత అదనపు సమయం ఇవ్వాలని కోరుతున్నామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. అయితే ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాగే సిలబస్ ఎక్కువగా ఉందని, ఈ రెండు కారణాల దృష్ట్యా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి కాకుండా, మరో 2 నెలలు పాటు వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత బంకిం చంద్ర ఛటర్జీ

వాల్మీకిపురం : వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర ఛటర్జీ స్ఫూర్తి ప్రదాత అని జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ కొనియాడారు. బంకిం చంద్ర ఛటర్జీ జయంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బంకిం చంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశంలోని గొప్ప కవులు, నవలా రచయితలలో బంకిం చంద్ర ఛటర్జీ ఒకరన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం అనే నినాదం సంజీవనిలా పనిచేసిందని గుర్తుచేశారు. ఆనంద్‌మఠ్ అనే గ్రంథంలో ఆయన వందేమాతరం గేయాన్ని రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు దామోదరం, రమేష్, శ్రీరాములు, యోగరంజని, యుగంధర్, సువర్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కడప ఎడ్యుకేషన్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ అన్నారు. గురువారం కడప నగరం ఎర్రముక్కపల్లె గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాచట్టాలు, మంచి, చెడు స్పర్శ, విద్యా హక్కు, బాల కార్మిక నిరోధక చట్టం వంటి పలు చట్టాల గురించి పిల్లలకు వివరించారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 100, 1098, 15100, పోక్సోచట్టం మొదలగు అంశాల గురించి కూడా వివరించారు.

29 నుంచి మహాయాగం

కడప కల్చరల్ : నగరానికి చెందిన ఆధ్యాత్మ విద్యా ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో దశకోటి కృష్ణ మంత్ర మహాయాగం, సరస్వతి మహాయాగం నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధి పండిత డాక్టర్ మాళిగి విద్యానిధి ఆచార్య తెలిపారు. గురువారం కడప బ్రాహ్మణ వీధిలోని శ్రీ జూల్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ఇతర ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం గోపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణం, ప్రధాన దేవతా ప్రతిష్ఠాపనం, మహా మంగళ హారతి, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ సత్యభామ రుక్మిణి సమేత కృష్ణ పరమాత్ముడి వివాహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 7.30 కు సంగీత కచేరి ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు దశకోటి కృష్ణ మంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆనంద తీర్థ, గుండూరావు, తదితరులు పాల్గొన్నారు.